రైల్వే జోన్ ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్ టెలికం ఇంజినీర్‌గా సౌరభ్

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ) : దక్షిణ మధ్య రైల్వే జోన్ ప్రిన్సిపల్ చీఫ్ సిగ్నల్ అండ్ టెలికం ఇంజినీర్‌గా సౌరభ్ బందోపాధ్యాయ (ఐఆర్ఎస్ఎస్ఈ) మంగళవారం బాధ్యతలు స్వీకరించినట్టు రైల్వే అధికారులు తెలిపారు. ఆయన ఇండియన్ రైల్వే సర్వీస్ ఆఫ్ సిగ్నల్ ఇంజినీర్స్ -1990 బ్యాచ్‌కి చెందిన వారని పేర్కొన్నారు.

'ఎంబీసీల సంక్షేమానికి 2 వేల కోట్లు ఇవ్వండి'

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర ప్రభుత్వం 2024-25 పూర్తిస్థాయి బడ్జెట్‌లో ఎంబీసీ కులాలు, రజకులు, నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి రూ.2 వేల కోట్లు కేటాయించాలని ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కకు లేఖ రాశారు. ఆధునిక ధోబీఘాట్లు, కమ్యూనిటీల అభివృద్ధికి మరో రూ.వెయ్యి కోట్లు కేటాయించాలని విజ్ఞప్తిచేశారు.

రాష్ట్రంలో వాహనాల సంఖ్య 1.54 కోట్లు

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో వాహనాల సంఖ్య రోజురోజుకు పెరిగిపోతున్నది. ఇప్పటి వరకు రాష్ట్రంలో 1.54 కోట్ల వాహనాలున్నాయి. వీటిలో 1.13 కోట్లు ద్విచక్ర వాహనాలు కాగా, 41 లక్షలు ఇతర వాహనాలున్నాయి. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 84 లక్షల వాహనాలు ఉన్నాయి. వీటిలో కార్లే దాదాపు 15 లక్షలు ఉంటాయి. ఈ లెక్కన ప్రతి కిలోమీటరుకు సుమారు 10వేల వాహనాలున్నట్టు తెలుస్తున్నది.

ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం

- బాలాపూర్‌లో రెండున్నర ఎకరాలు కబ్జా
- రెవెన్యూ అధికారులకు గ్రామస్థుల ఫిర్యాదు
- స్పందించకపోవడంతో జిల్లా కలెక్టర్‌కు మొర

బాలాపూర్ గ్రామ పరిధిలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు

హైదరాబాద్ సిటీబ్యూరో ప్రధాన ప్రతినిధి, జూలై 2 (నమస్తే తెలంగాణ)/బడంగ్‌పేట: రంగారెడ్డి జిల్లా బడంగ్‌పేట మండలంలో ప్రభుత్వ భూమి అన్యాక్రాంతమవుతున్నా అధికారులు స్పందించడం లేదు. కబ్జాలను గుర్తించిన గ్రామస్థులు తహసీల్దారుకు ఫిర్యాదు చేసినా స్పందన లేకపోవడంతో మంగళవారం వారు జిల్లా కలెక్టర్‌ను ఆశ్రయించారు.

రెండున్నర ఎకరాల్లో అక్రమ నిర్మాణాలు

ఇటీవల బాలాపూర్‌లోని సర్వేనంబర్ 74లో కొంత భూమిని ఆక్రమించి కొందరు ప్రహరీ నిర్మాణాలు చేపట్టారు. సుమారు రెండున్నర ఎకరాల వరకు భూమిని కబ్జా చేసేందుకు పథకం రచించడంతో గ్రామస్థులు అప్రమత్తమయ్యారు. దీనిపై బాలాపూర్ తహసీల్దార్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. కానీ అధికారులు ఎటువంటి చర్యలూ చేపట్టలేదు. దీంతో గ్రామస్థులు మంగళవారం రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌కు వెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఆ ప్రాంతంలో ఇప్పటికే కబ్జా అయిన భూమి పోగా కనీసం మరో 10 ఎకరాలు ఇంకా ప్రభుత్వ భూమి ఉంటుందని గ్రామస్థులు పేర్కొన్నారు. ఆ భూముల ధర చదరపు గజం 60-70 వేల వరకు పలుకుతున్న నేపథ్యంలో ఎకరా రూ.30 కోట్ల చొప్పున దాదాపు రూ.300 కోట్ల విలువైన భూమి ప్రభుత్వ ల్యాండ్ బ్యాంక్‌లోకి చేరే అవకాశముంది.

132 ఎకరాల ప్రభుత్వ భూమి

గ్రామ పరిధిలోని సర్వేనంబర్ 74లో 132.02 ఎకరాల ప్రభుత్వ భూమి (గైరాన్ సర్కారి) ఉన్నట్టు ప్రభుత్వ రికార్డులు చెబుతున్నాయి. ఇందులో 1980 దశకంలో కొంత భూమిని నిరుపేదల ఇండ్ల కోసం వినియోగించారు. మరికొంత భూమిని శ్మశాన వాటికకు కేటాయించారు. 1993-94లో కేంద్ర ప్రభుత్వరంగ ఏఆర్‌సీఐకి ఇందులో 99 ఎకరాలు కేటాయించారు. అప్పటికే ఆ భూముల్లో కొందరు వ్యవసాయం చేసుకుంటుండటంతో వారికి ఏఆర్‌సీఐ ఎకరాకు రూ.5వేల చొప్పున పరిహారంతోపాటు వారి కుటుంబంలో ఒకరికి తమ సంస్థలో ఉద్యోగం కూడా కల్పించింది. మిగిలిన భూమిని కాపాడాల్సిన రెవిన్యూ యంత్రాంగం చర్యలు చేపట్టకపోవడంతో ప్రతి ఏటా ఎకరాల కొద్దీ భూమి అన్యాక్రాంతమవుతున్నది.

చర్యలు తీసుకుంటాం

ఈ కబ్జాపై 'నమస్తే తెలంగాణ' బాలాపూర్ తహసీల్దార్ మాధవీరెడ్డిని సంప్రదించగా ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కావటం నిజమేనన్నారు. దీనిపై సర్వే చేపట్టాలని నిర్ణయించామని, సర్వే నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈలోగా అక్రమ నిర్మాణ పనులను నిలిపివేయవచ్చు కదా.. అని ప్రశ్నించగా తమకు తగిన సిబ్బందిలేరని అన్నారు. ప్రస్తుతం ధరణి పోర్టల్‌లో ఈ సర్వేనంబర్‌లో 132.05 ఎకరాలను ప్రభుత్వ భూమిగా చూపుతున్నప్పటికీ.. నిషేధిత జాబితాలో అసలు ఈ సర్వే నంబరే లేకపోవడం గమనార్హం. ఇదే విషయాన్ని తహసీల్దార్ ముందు ప్రస్తావించగా.. ఇప్పటికిప్పుడు తమ వద్ద సమాచారం లేదని, ఎందుకు నిషేధిత జాబితాలో చేర్చలేదో తెలుసుకుంటామని చెప్పారు.

మాదాపూర్‌లో ఆందోళన చేస్తున్న క్యాబ్ డ్రైవర్లు

బతుకులు ఆగమైనయ్.. ఆదుకోండి

- కమీషన్ల రూపంలో ర్యాపిడో అన్యాయం చేస్తున్నది
- ప్రత్యేక యాప్ తీసుకొస్తామని ప్రభుత్వం మాటిచ్చింది
- తమను ఆదుకోవాలంటూ క్యాబ్ డ్రైవర్ల డిమాండ్
- మాదాపూర్‌లోని ర్యాపిడో ఆఫీస్ ఎదుట ఆందోళన

హైదరాబాద్ సిటీబ్యూరో, జూలై 2 (నమస్తే తెలంగాణ): ర్యాపిడో తమకు సరైన గిట్టుబాటు ధర కల్పించకుండా కమీషన్ల రూపంలో అన్యాయం చేస్తున్నదని ట్యాక్సీ డ్రైవర్లు మంగళవారం మాదాపూర్‌లోని ర్యాపిడో కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. వంద మంది డ్రైవర్లు ఒక్కసారిగా కార్యాలయం వద్ద ఆందోళనకు దిగటంతో ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. పోలీసులు వారిని స్టేషన్‌కు తరలించారు. తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని డ్రైవర్లు నినాదాలు చేశారు. ప్రత్యేక యాప్ తీసుకొచ్చి డ్రైవర్లకు న్యాయం చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం మాటిచ్చిందని, ఇంకా అది కార్యరూపం దాల్చడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం అక్కడి నుంచి ట్యాక్సీ డ్రైవర్లు సీఎం రేవంత్‌రెడ్డి నివాసం వద్ద ధర్నాకు ప్రయత్నించగా, పోలీసులు అనుమతించకపోవటంతో తమకు న్యాయం చేయాలంటూ నినాదాలు చేశారు. అక్కడ ఉన్న అధికారులకు వినతి పత్రం అందించారు. అనంతరం అమ్మ క్యాబ్స్ డ్రైవర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వినయ్‌భూషణ్ మాట్లాడుతూ.. కమీషన్ల పేరుతో ర్యాపిడో అన్యాయం చేస్తున్నదని మండిపడ్డారు. వాహనం క్యాటగిరీని బట్టి కిలోమీటర్‌కు ఇంత అని ఫిక్స్ చేయాలని డిమాండ్ చేశారు. 4+1 క్యాబ్‌కు కిలోమీటర్‌కు రూ. 30, 6+1 క్యాబ్‌కు రూ. 35, 7+1 క్యాబ్‌కు 40 రూపాయలు ఫిక్స్ చేయాలని, ఎలాంటి కోతలు లేకుండా ఈ మొత్తాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉచిత బస్సు స్కీంతో చాలావరకు రైడ్స్ తగ్గాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇల్లు గడవడం కష్టంగా మారిందని, స్కూలు ఫీజులు, వాహన ఈఎంఐలు చెల్లించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పారు. ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో అసోసియేషన్ నాయకులు మిర్జానాజఫ్ అలీ, నాగరాజు, డేవిడ్, సంతోష్‌కుమార్, అమర్‌నాథ్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ప్లీడర్ల తొలగింపుపై

వివరణ ఇవ్వండి

ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నియమితులైన ప్రభుత్వ న్యాయవాదులు, సహాయ న్యాయవాదులు, ప్రత్యేక న్యాయవాదులను పదవీకాలం పూర్తికాకుండానే ఎందుకు తొలగించాల్సివచ్చిందో వివరణ ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ కోర్టుల్లో పనిచేస్తున్న జీపీలు, ఏజీపీలను తొలగిస్తూ గత నెల 26న ప్రభుత్వం జారీచేసిన జీవో 354కు వ్యతిరేకంగా 20 మంది హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్లపై జస్టిస్ పుల్లా కార్తీక్ మంగళవారం విచారణ జరిపారు. పిటిషనర్ల తరపు న్యాయవాది వాదనలు విన్న అనంతరం ప్రభుత్వ వివరణ కోరుతూ నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను ఈ నెల 8కి వాయిదా వేశారు. ఆ లోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించారు.

చెట్ల రక్షణకు చట్టమేది?

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో జనాభాకు తగ్గట్టుగా చెట్ల పెంపకం, పార్కులు, పచ్చదనం అభివృద్ధి జరగడం లేదని హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. కర్ణాటకలో చెట్ల పరిరక్షణకు ప్రత్యేకంగా చట్టం ఉన్నదని పేర్కొంటూ.. అలాంటి చట్టం తెలంగాణలో ఉన్నదా? అని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. లేకుంటే కర్ణాటక తరహాలో రాష్ట్రంలో కూడా చట్టాన్ని తీసుకురావాలని సూచించింది. రాష్ట్రంలో పార్కులకు కేటాయించిన స్థలాలను పరిరక్షించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టడం లేదంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్ కుమార్ ధర్మాసనం మంగళవారం విచారణ జరిపి ఈ సూచన చేసింది. తదుపరి విచారణను గురువారానికి వాయిదా వేసింది.

పరిహారంతో సరిపెడితే కుదరదు

వీధి కుక్కల దాడులను నిరోధించేందుకు శాశ్వత చర్యలు చేపట్టాల్సిందే: హైకోర్టు

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): వీధి కుక్కల దాడుల్లో గాయపడిన, మరణించిన బాధితుల కుటుంబాలకు ప్రభుత్వం పరిహారాన్ని చెల్లించి చేతులు దులిపేసుకుంటే కుదరదని, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూసేందుకు శాశ్వత చర్యలు చేపట్టాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. అనుపమ్ త్రిపాఠి వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాల్సిందేనని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జే అనిల్ కుమార్ ధర్మాసనం తేల్చిచెప్పింది. ప్రజలపై వీధి కుక్కల దాడులను నిరోధించేందుకు చేపట్టిన చర్యలతోపాటు సుప్రీంకోర్టు తీర్పును ఏ మేరకు అమలు చేస్తారన్న దానిపై పూర్తి వివరాలతో నివేదిక సమర్పించాలని ప్రభుత్వాన్ని ఆదేశిస్తూ.. తదుపరి విచారణను ఈ నెల 7కు వాయిదా వేసింది.

ఈడీ ఎదుట ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): మైనింగ్ తవ్వకాల్లో అక్రమాలకు పాల్పడ్డారంటూ నమోదైన కేసులో పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మంగళవారం ఈడీ ఎదుట హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈడీ అధికారులు అడిగిన పలు ప్రశ్నలకు ఆయన సమాధానం ఇచ్చారు. మహిపాల్‌రెడ్డి, అతని సోదరుడు మధుసూదన్‌రెడ్డి ఇండ్లల్లో ఇటీవల ఈడీ అధికారులు రెండు రోజులపాటు సోదాలు చేసి రూ.300 కోట్లు ప్రభుత్వానికి నష్టం వాటిల్లేలా అక్రమ మైనింగ్, రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారని ఆరోపించారు. దీనిపై ఎమ్మెల్యే తమ ఎదుట హాజరుకావాలని నోటీసులు పంపగా.. ఆయన ఈడీకి వివరణ ఇచ్చుకున్నారు.

తొలిరోజు 89 కేసులు నమోదు

ఎక్సైజ్ శాఖలో తొలి ఎన్డీపీఎస్ కేసు నమోదు

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ) : దేశవ్యాప్తంగా సోమవారం నుంచి అమల్లోకి వచ్చిన నూతన క్రిమినల్ చట్టాల్లోని పలు సెక్షన్ల కింద తెలంగాణలో తొలిరోజు 89 కేసులు నమోదైనట్లు సీఐడీ డీజీ శిఖాగోయెల్ తెలిపారు. తొలి కేసు చార్మినార్ పీఎస్‌లో నమోదైనట్లు వెల్లడించారు. నార్కోటిక్ డ్రగ్స్ అండ్ సైకోట్రోనిక్ సబ్‌స్టాన్సెస్ యాక్ట్ (ఎన్డీపీఎస్) కింది మేడ్చల్ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో తొలి కేసు నమోదు అయిందన్నారు. విశాఖపట్నానికి చెందిన విజయలక్ష్మి అక్కడి నుంచి గంజాయిని తీసుకువచ్చి మంగళవారం హైదరాబాద్‌లో విక్రయిస్తుండగా ఎక్సైజ్ సిబ్బంది 2.1 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని కొత్త చట్టం ప్రకారం కేసు నమోదు చేశామని సీఐ నర్సిరెడ్డి తెలిపారు. ఈ కేసులో విజయలక్ష్మితో పాటు రంగారెడ్డి జిల్లా మాడుగులకు చెందిన సాయితేజను అరెస్టు చేసినట్లు చెప్పారు.

అదానీ-హిండెన్‌బర్గ్ మధ్యలో కొటక్!

హిండెన్‌బర్గ్‌కు సెబీ నోటీసులు

- అదానీ స్టాక్స్‌కు సంబంధించిన పెట్టుబడుల్లో నిబంధనల ఉల్లంఘన పేరిట సమన్లు జారీ
- కొటక్ బ్యాంక్‌ను పూర్తిగా రాయకపోవడంపై హిండెన్‌బర్గ్ ప్రశ్న
- మరో వ్యాపారవేత్తను రక్షించే చర్యలంటూ మండిపాటు

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, జూలై 2 (నమస్తే తెలంగాణ): అమెరికా షార్ట్ సెల్లింగ్ రిసెర్చ్ కంపెనీ హిండెన్‌బర్గ్, అదానీ గ్రూప్‌ల మధ్య ఏడాదిన్నర కాలంగా కొనసాగుతున్న వివాదం కీలక మలుపు తిరిగింది. అదానీ వివాదానికి సంబంధించి ఇండియా మార్కెట్ రెగ్యులేటర్ సెక్యూరిటీస్ అండ్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) హిండెన్‌బర్గ్‌కు గత నెల 27న 46 పేజీల షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు మంగళవారం హిండెన్‌బర్గ్ వెల్లడించింది. అదానీ స్టాక్స్‌పై పెట్టుబడుల్లో తాము నిబంధనల్ని ఉల్లంఘించినట్లు సెబీ నోటీసుల్లో పేర్కొన్నట్లు తెలిపింది. అయితే, ఈ వివాదంలో కొటక్ బ్యాంక్ ప్రస్తావనను హిండెన్‌బర్గ్ ఉటంకించడం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

అసలేం జరిగింది?

అదానీ గ్రూప్ కంపెనీల్లో ఆర్థిక అవకతవకలు జరిగాయంటూ కిందటేడాది జనవరిలో హిండెన్‌బర్గ్ బాంబు పేల్చింది. దీంతో అదానీ గ్రూప్ కంపెనీల షేర్లు భారీగా క్షీణించాయి. ఈ వివాదంపై దర్యాప్తు చేపడుతున్న సెబీ సుప్రీంకోర్టు ఆదేశాలమేరకు తాజాగా హిండెన్‌బర్గ్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. అదానీ స్టాక్స్‌పై పెట్టుబడుల ద్వారా ఆ కంపెనీ 22.25 మిలియన్ డాలర్ల లాభాలు పొందిందన్నది.

అర్థంలేని నోటీసులు: హిండెన్‌బర్గ్

సెబీ షోకాజ్ నోటీసులను హిండెన్‌బర్గ్ 'అర్థంపర్థం లేనివి'గా కొట్టిపారేసింది. ఉద్దేశపూర్వకంగానే సెబీ ఆ నోటీసులను జారీ చేసిందని మండిపడింది. భారత్‌లోని శక్తిమంతమైన వ్యాపారవేత్తల లోపాలను ఎత్తిచూపే వారిని సెబీ బెదిరింపులకు గురిచేస్తుందని, ఇలాంటి చర్యలకు తాము భయపడబోమని స్పష్టం చేసింది. చిన్న మదుపర్లను రక్షించాల్సిన సెబీ అక్రమాలకు పాల్పడ్డ బడా వ్యాపారవేత్తలకు కొమ్ముకాస్తున్నదని తీవ్రంగా ధ్వజమెత్తింది.

సెబీ పేర్కొన్న లాభాలేమీ రాలే..

సెబీ ఆరోపించినట్టు అదానీ కంపెనీల షార్ట్ సెల్లింగ్ ప్రక్రియలో తమకు భారీ లాభాలేమీ రాలేదని హిండెన్‌బర్గ్ ఈ సందర్భంగా వెల్లడించింది. అదానీ షేర్ల షార్టింగ్ ద్వారా 4.1 మిలియన్ డాలర్ల స్థూల ఆదాయం పొందినట్టు, అదానీ అమెరికా బాండ్ల షార్ట్ ద్వారా మరో 31 వేల డాలర్లు లభించినట్టు వెల్లడించింది. ఖర్చులు పోను ఏమీ మిగల్లేదన్నది.

ఆరోపణలు అవాస్తవం: కొటక్

హిండెన్‌బర్గ్ చేసిన ఆరోపణలపై కొటక్ బ్యాంక్ స్పందించింది. ఈ వ్యవహారంతో అసలు సంబంధం లేదని వెల్లడించింది. బ్యాంక్ ఫారిన్ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ కింగ్డన్ క్యాపిటల్ మేనేజ్‌మెంట్‌కు హిండన్‌బర్గ్ అసలు క్లయింటే కాదని పేర్కొంది. తమ ఫండ్‌లో హిండెన్‌బర్గ్ అసలు ఇన్వెస్టర్ కూడా కాదని స్పష్టంచేసింది. అయినప్పటికీ సంస్థ షేర్లు 4 శాతం నష్టపోయాయి.

'కొటక్' పేరు రాయరెందుకు?

సెబీ నోటీసులపై హిండెన్‌బర్గ్ స్పందిస్తూ 'కొటక్ బ్యాంక్' పేరును ప్రస్తావించడం ఇప్పుడు సంచలనంగా మారింది. బిలియనీర్ ఉదయ్ కొటక్ నేతృత్వంలోని కొటక్ బ్యాంక్ విదేశీగడ్డపై ఓ ఫండ్‌ను ఏర్పాటుచేసినట్లు ఈ సందర్భంగా హిండెన్‌బర్గ్ వెల్లడించింది. దాన్ని ఉపయోగించుకొని కింగ్డన్ క్యాపిటల్ అనే పెట్టుబడి భాగస్వామి ద్వారా అదానీ స్టాక్స్‌ను తాము షార్ట్ చేసినట్లు పేర్కొంది. ఇందులో కొటక్ మహీంద్రా ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ (కేఎంఐఎల్), కేఐవో ఎఫ్ సహకారం ఉన్నట్టు తెలిపింది. అయితే, సెబీ తమకు ఇచ్చిన నోటీసుల్లో ఎక్కడా కొటక్ పేరు గానీ, ఆ సంస్థ బోర్డు సభ్యుల ప్రస్తావన గానీ ప్రస్తావించలేదని మండిపడింది. కేఎంఎల్ఐ అంటూ పొడి అక్షరాలను వాడుతూ, కే-ఇండియా అపర్చునిటీస్ ఫండ్ లిమిటెడ్ అంటూ కొటక్ పేరు బయటకు రాకుండా సెబీ జాగ్రత్తలు తీసుకొన్నట్టు విరుచుకుపడింది.

ఫార్మా సదస్సుకు హాజరు కావాలని సీఎం రేవంత్ రెడ్డిని ఆహ్వానిస్తున్న హెటిరో గ్రూప్ చైర్మన్ పార్థసారథి రెడ్డి, ఇండస్ట్రీ వర్గాలు

హైటెక్స్‌లో 5న భారతీయ ఔషధ సదస్సు

హైదరాబాద్, జూలై 2: ఈ ఏడాదికిగాను 73వ ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్ వద్ద జరుగనున్నది. ఈ నెల 5-7 తేదీల్లో మూడు రోజులపాటు ఇండియన్ ఫార్మాస్యూటికల్ అసోసియేషన్ ఈ సదస్సును నిర్వహించనున్నది. 'ప్రపంచ శ్రేయస్సు కోసం భారతీయ ఔషధ రంగ పాత్ర' అనే థీమ్‌తో ఈసారి సమావేశాలు జరుగుతున్నాయి. దాదాపు 9,000 మంది నిపుణులు, పరిశోధకులు, వ్యాపార, పారిశ్రామిక వర్గాలు, వివిధ కంపెనీల ప్రతినిధులు, ఎగ్జిబిటర్లు పాల్గొంటారని అంచనా. ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా కోరుతూ తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డిని ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ అసోసియేషన్ ఆహ్వానించింది.

సీఎంతో నోకియా బృందం భేటీ..

నోకియా కంపెనీకి చెందిన ఓ ప్రతినిధి బృందం మంగళవారం సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా భేటీ అయ్యింది. వీరిలో నోకియా గ్లోబల్ హెడ్ మార్టిన్, సేల్స్ హెడ్ మ్యాన్క్, గ్లోబల్ డైరెక్టర్ వెంకట్‌తోపాటు ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ ఉన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబుతోనూ భేటీ అయ్యారు.

వాణిజ్య

వెస్పా స్కూటర్ ధర 14.28 లక్షలు

న్యూఢిల్లీ, జూలై 2: దేశీయ మార్కెట్లోకి నయా వెస్పా అందుబాటులోకి వచ్చింది. లిమిటెడ్ ఎడిషన్‌గా విడుదలైన ఈ వెస్పా 946 డ్రాగన్ స్కూటర్ 155 సీసీ సామర్థ్యంతో తీర్చిదిద్దింది. కేవలం అంతర్జాతీయంగా 1,888 యూనిట్లు మాత్రమే విక్రయిస్తున్న ఈ మాడల్ ధర రూ.14,27,999(ఢిల్లీ షోరూంనకు సంబంధించినవి)గా నిర్ణయించింది. భారత్‌లో ఎన్ని యూనిట్లు విక్రయిస్తున్న విషయాన్ని మాత్రం సంస్థ వెల్లడించలేదు. ఈ స్కూటర్ కోసం ముందస్తు బుకింగ్‌లు ఆరంభించింది కూడా సంస్థ. డ్యూయల్ చానెల్ ఏబీఎస్, 200 ఎంఎం డిస్క్ బ్రేక్ వంటి ఫీచర్స్‌తో రూపొందించిన ఈ స్కూటర్ యువతకు నచ్చుతుందని పేర్కొంది.

ఐసీఐసీఐ సఫిరో ఫారెక్స్ కార్డ్

విదేశీ విద్యార్థుల కోసం తెచ్చిన బ్యాంక్

న్యూఢిల్లీ, జూలై 2: దేశీయ ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ సంస్థ ఐసీఐసీఐ బ్యాంక్.. మంగళవారం ఓ ప్రీ-పెయిడ్ ఫారెక్స్ కార్డును పరిచయం చేసింది. ఉన్నత విద్యను అభ్యసించేందుకు విదేశాలకు వెళ్తున్న విద్యార్థుల కోసం 'సఫిరో' సిరీస్‌లో ఈ కార్డును బ్యాంక్ తీసుకొచ్చింది. చదువు సంబంధిత ఖర్చులను అధిగమించడానికి అటు విద్యార్థులతోపాటు ఇటు తల్లిదండ్రులకూ తమ ఈ కార్డు ఎంతో సౌకర్యవంతంగా, ప్రయోజనకరంగా ఉంటుందని ఈ సందర్భంగా ఐసీఐసీఐ బ్యాంక్ తెలిపింది. అడ్మిషన్ ఫీజులు, కోర్సు సంబంధిత చెల్లింపులతోపాటు ప్రయాణం, భోజనం, కిరాణా ఇతర రోజువారీ ఖర్చులకు సఫిరో ఫారెక్స్ కార్డు ఉపయోగపడుతుందని ఓ ప్రకటనలో బ్యాంక్ వివరించింది.

- ఈ కార్డు వినియోగదారులు 15 దేశాల కరెన్సీల్లో లావాదేవీలను ఎలాంటి చార్జీలు లేకుండానే చేసుకోవచ్చు.
- కేవలం ఒక్క కరెన్సీకి చెందిన నగదే ఉన్నా.. విద్యార్థులకు ప్రపంచవ్యాప్తంగా ప్రయాణించే వెసులుబాటు ఉంటుంది.
- కస్టమర్లకు ఒక ప్రైమరీ కార్డుతోపాటు ఓ రీప్లేస్‌మెంట్ కార్డును ఐసీఐసీఐ ఇస్తుంది.
- ప్రైమరీ కార్డు పోయినప్పుడు/పాడైపోయినప్పుడు ఐమొబైల్ పే, ఇంటర్నెట్ బ్యాంకింగ్ లేదా బ్యాంక్ కస్టమర్ కేర్‌కు ఫోన్ చేయడం ద్వారానైనా రీప్లేస్‌మెంట్ కార్డును యాక్టివేట్ చేసుకోవచ్చు.

హైదరాబాద్‌లో ఫినోమ్

హైదరాబాద్, జూలై 2: మానవ వనరుల సేవలు అందించే ఫినోమ్.. అమెరికా కేంద్ర స్థానంగా కార్యకలాపాలు అందిస్తున్న టైడీని హస్తగతం చేసుకున్నది. ఆర్థిక వివరాలు మాత్రం సంస్థ వెల్లడించలేదు. ఈ సందర్భంగా కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ శివానంద్ మాట్లాడుతూ.. మానవ వనరులకు పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని వచ్చే రెండేండ్లకాలంలో మరో వెయ్యి మంది సిబ్బందిని నియమించుకోనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రస్తుతం సంస్థకు హైదరాబాద్‌లో రెండు, వైజాగ్‌లో ఒక కార్యాలయం ఉండగా, వీటిలో 950 మంది వరకు విధులు నిర్వహిస్తున్నారు. హైదరాబాద్‌తోపాటు వైజాగ్‌లో మరో కార్యాలయాన్ని ఏర్పాటు చేయబోతున్నది.

టారిఫ్‌లు పెంచినా జియో ప్లాన్లే చౌక

హైదరాబాద్, జూలై 2: దేశీయ టెలికం దిగ్గజాలైన జియో, ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు రీచార్జి ప్లాన్ల ధరలను పెంచుతూ టెలికం కస్టమర్లకు షాకిచ్చిన విషయం తెలిసిందే. గతవారంలో జియో తన ప్లాన్ల ధరలను 10 శాతం నుంచి 21 శాతం వరకు పెంచుతూ నిర్ణయం తీసుకోగా.. ఎయిర్‌టెల్, వొడాఫోన్ ఐడియాలు కూడా ప్లాన్ల ధరలను 25 శాతం వరకు సవరించాయి. అయితే చార్జీలు పెంచిన తర్వాత జియో ప్లాన్లే చౌక ధరకు లభిస్తుండటం విశేషం. ఉదాహరణకు రోజుకు 1 జీబీ డాటా, అన్‌లిమిటెడ్ ప్లాన్ ధర రూ.249 కాగా, అదే ఎయిర్‌టెల్/వొడాఫోన్ ఐడియాలు రూ.299కి అందిస్తున్నాయి. అంటే 20 శాతం తక్కువ ధరకే లభిస్తుండటంతో రూ.50 ఆదా కానున్నది. అలాగే రోజుకు 2 జీబీ డాటా, అన్ లిమిటెడ్ కాలింగ్ ప్లాన్ జియో రూ.249కి అందిస్తుండగా, ఎయిర్‌టెల్/వొడాఫోన్ ఐడియాలు రూ.379గా ఉన్నది. జియో కస్టమర్లు 9 శాతం తక్కువ ధరకే ఈ ప్లాన్ లభిస్తుండటం విశేషం. మరోవైపు, మూడు నెలల ప్లాన్ విషయానికి వస్తే 6జీబీ డాటా, అన్ లిమిటెడ్ కాలింగ్ ప్లాన్‌ను జియో రూ.479కి అందిస్తుండగా, అదే ఎయిర్‌టెల్/వొడాఫోన్ ఐడియాలు ఆరు శాతం అధికంగా రూ.509కి అందిస్తున్నాయి. రోజుకు 1.5 జీబీ డాటా ప్లాన్ జియో ధర రూ.799 ఉండగా, అదే పోటీ సంస్థలైన ప్లాన్లు 8 శాతం ఎక్కువగా రూ.859కి అందిస్తున్నాయి.

మాల్యాకు ఎన్బీడబ్ల్యూ

ముంబై, జూలై 2: పరారీ వ్యాపారవేత్త విజయ్ మాల్యాపై తాజాగా మరో నాన్-బెయిలబుల్ వారెంట్ (ఎన్బీడబ్ల్యూ) జారీ అయ్యింది. ప్రభుత్